

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర




సంపుటి : 4 సంచిక : 26 పుష్పం :32 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 7-2-99, సఖినేటిపల్లి)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు గర్వం వచ్చినా, వికారం వచ్చినా, సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా మనకు దేహాభిమానం ఉంది అని అర్థం. గురువుకు దేహాభిమామం ఉండదు కాబట్టి ఆయనకు గర్వం ఉండదు, వికారము ఏమీ ఉండదు. గురువు కర్మఫలాన్ని ఆశించి పని చేయడు. మనం కర్మ ఫలాన్ని ఆశిస్తాము. ఫలాపేక్ష ఉంటే మనకు పునర్జన్మ వస్తుంది అని భగవంతుడు చెప్పాడు. భగవంతుడు చెప్పిన మాటలు మార్చటానికి వీలులేదు. యుగాలు మారిపోయిన ఆ మాట అలాగ ఉండవలసిందే. పూర్వజన్మలో మనం కర్మఫలాన్ని ఆశించి పని చేసాము. ఏ రకమైన కర్మ చేసామో ఆ రకమైన ఫలితం వస్తుంది. ఆకర్మ ఫలితాన్ని భోగించాము. తదనుగుణంగా ఈ జన్మలో దేహాలు వచ్చాయి. లోపల ఉన్న సత్యానికి ఈ విషయాలకు ఏమీ సంబంధం లేదు. జ్ఞాని పని చేస్తాడు, అజ్ఞాని పని చేస్తాడు కాని తేడా ఏమిటి అంటే జ్ఞాని చేసే పని నీటి మీద గీతలాగ ఉంటుంది. నేను చేస్తున్నాను అని అనుకోడు. ఏదో దేహం వచ్చింది. అది ఎందుకు వచ్చిందో ఆ పని చూసుకొని వెళ్ళిపోతుంది అనుకొంటాడు. నేను చేస్తున్నాను అనే భావన ఉండదు. అజ్ఞాని పనిచేస్తాడు. వాడి కోరికలు నెరవేర్చుకోవటానికి పనిచేస్తాడు. వాడికి కలిసి రాదు అంటే ఆపని చేయడు. జ్ఞానికి కోరిక లేదు. ఈశ్వరుని ప్రేరణను బట్టి పనిచేస్తాడు. అజ్ఞాని కోరికలు దృష్టిలో పెట్టుకొని భోగ బుద్ధితో పనిచేస్తాడు. జ్ఞానిస్థితిని పొందాలంటే భోగబుద్ధిని తగ్గించుకొంటూ జ్ఞానబుద్ధిని పెంచుకోవాలి. అజ్ఞానంలో కర్తృత్వం ఉంటుంది. కర్తృత్వంతో పనిచేస్తే అది బంధిస్తుంది. కర్తృత్వం లేకుండా పనిచేస్తే మోక్షం వస్తుంది. ఒక స్వాములు వారు ఏమి చెప్పారు అంటే దేహానికి రోగం వస్తుంది, దేహానికి నాకు సంబంధం లేదు. దేహానికి రోగానికి సంబంధం కాబట్టి అవి రెండూ చూసుకొంటాయి అని చెప్పారు. అంటే నీ దేహం ఆరోగ్యంగా ఉన్నా, అనారోగ్యంగా ఉన్నా నీ లక్ష్యాన్ని మర్చిపోకు, నీ ఆనందమును వదులుకోకు, ఆత్మసుఖాన్ని విడిచిపెట్టకు అని చెప్పటం.

నీ మనస్సు, దేహము, వికారములు నీకు తెలుస్తున్నాయి. దేవుడు కొంతమంది ఉన్నాడని, కొంతమంది లేడని చెపుతున్నారు. ఉన్నాడు అని చెప్పినా, లేడు అని చెప్పినా ఉన్నవాడు ఎక్కడికి పోతాడు. నీ దేహానికి, మనస్సుకు, వికారములకు అన్నింటికి వేరుగా ఒకటి ఉంది. దేని ప్రకాశం

వలన నీ దేహము, నీమనస్సు, నీమనస్సులో ఉన్న గుణాలు ఇవి అన్నీ తెలియబడుతున్నాయో అదే దేవుడు. దేని ప్రకాశం వలన ఇవి అన్నీ నీకు తెలుస్తున్నాయో అది లేదని నీవు అనుకొంటున్నావు. ఉన్నది అదే ఇవి ఏమీలేవు. దేవుడు అనేవాడు లేకపోతే, వాడికి సంబంధించిన ప్రకాశమే లేకపోతే నీ దేహము, నీ మనస్సు నీకు తెలియబడదు. అది ఉంది, వీటికి వేరుగా ఉండి స్వయంగా ప్రకాశించటం వలన దాని వెలుతురులో ఇవి మనకు తెలుస్తున్నాయి. సూర్యుడు యొక్క ప్రకాశం వలన వస్తు జాలం ఎలా తెలియబడుతోందో ఆత్మ ప్రకాశం వలన నీమనస్సు, దేహము, నీ మనస్సులోని గుణాలు నీకు తెలియబడుతున్నాయి. అది లేకపోతే ఏదీ నీకు తెలియదు. దేహము, మనస్సు నీకు అనుభవంలో ఉన్నాయి కాబట్టి ఇవి ఉన్నాయి అనుకొంటున్నావు. వస్తువు అనుభవంలో లేదు కాబట్టి అది లేదు అనుకొంటున్నావు. అది ఉంది. దాని ప్రకాశం వలననే ఈ దేహము, లోకము అన్నీ నీకు తెలియబడుతున్నాయి.

దేవుని పఠం పెట్టుకొని పూజలు చేస్తాము. మనకు ఇష్టమైన నామాన్ని స్మరించుకొంటాము రూపాన్ని ధ్యానించు కొంటాము. అదీ ధ్యానమే అది స్థూల ధ్యానం. కొంతమందిలో చాలా మంచి గుణాలు ఉంటాయి. ఆ గుణాలను ధ్యానం చేసుకొంటే అది కూడా ధ్యానమే అది సూక్ష్మ ధ్యానం. రూపధ్యానం కంటే గుణధ్యానం గొప్పది. గుణధ్యానం కంటే సూటిగా సత్యవస్తువును, ఆత్మ వస్తువును ధ్యానం చేయటం ఇంకా గొప్పది. రూపధ్యానం కంటే గుణధ్యానం ఎక్కువ లోతుల లోనికి తీసుకొని పోతుంది. ఆత్మధ్యానం ఇంకా ఇంకా లోతుల లోనికి తీసుకొని పోతుంది. ఎంత లోతులలోనికి మీరు వెళ్ళిపోతారు అంటే ఈశ్వరుడు హృదయంలో ఎంత లోతులలో ఉన్నాడో అక్కడకు వెళ్ళి ఆయనలో ఐక్యమవుతారు. బాహ్యంగా ఆయన చేసే పనిని బట్టి జ్ఞాని స్థితిని మనం ఊహించలేము. బాహ్యదృష్టితో మనం జ్ఞానిని, గురువును చూడలేము. వారి యొక్క లోపల వైభవం, అంతస్థు చూడాలి. అంతర్దృష్టి లేనివాడు ఆ వైభవం చూడలేడు. జ్ఞానం కలగటానికి భోగబుద్ధి సహకరించదు. త్యాగబుద్ధి సహకరిస్తుంది. నీలో మంచి లేకపోవచ్చును. ఎవరిలోనైనా మంచి గుణాలు ఉంటే ఆ మంచి గుణాలను ధ్యానం చేయండి. మీ దైనందిన జీవితంలో బాగా మార్పు వస్తుంది.

శిష్యుడికి ఆత్మబుద్ధి లేదు కాబట్టి గురువుని కూడా దేహంగా చూస్తాడు. గురువు దేహంలో ఉన్నా కూడా తాను ఎవడో తనకు తెలుస్తూ ఉంటుంది. గురువు శిష్యునితో కలిసి తిరుగుతాడు. కాని తను ఏ స్థితిని పొందాడో శిష్యుడు కూడా ఆ స్థితి పొందటానికి వాడిలో ఏదోషములు అడ్డువస్తున్నాయో చూస్తాడు. ఆదోషాలు వాడికి తెలియవు అందువలన ఆ దోషములను శిష్యునికి తెలియజేస్తాడు. పరిణామంలో వాటి వలన వచ్చే నష్టం, వాటి వలన ఎలా పతన మవుతాయో శిష్యునికి చూపిస్తాడు. ఆ దోషములను ఎలా తొలగించుకోవాలో శిక్షణ ఇస్తాడు. వాటిలోనుండి బయటపడే ఉపాయాన్ని చూపించి, వాటిని తొలగించుకొనే

శక్తిని కూడా ఇస్తాడు వాడు గురువు. దోషాల నుండి బయటపడేయటం ఒక్కటే కాదు గురువు యొక్క పని నీవు గమ్యానికి చేరే వరకు మనిషి కూడా నీడ వచ్చినట్లు జన్మజన్మలకు నీ కూడా వస్తాడు వాడు గురువు. ఎంత దయ, ఎంత ప్రేమో చూడండి. కుటుంబసభ్యుల మధ్య ఉన్న ప్రేమ ప్రేమ అని అనుకోవద్దు. మీ సంపాదన ఆగిపోయింది అనుకోండి మిమ్మల్ని ఎవరూ ప్రేమించరు. సంపాదన లేని మనిషిని ఇంటిలో నడుస్తున్న శవంలాగ చూస్తారు అని చెప్పారు. ఈ ప్రేమలు ప్రేమలు కాదు. మీ అమ్మ 10 ఎకరాలు ఇచ్చి చిన్న మాట అన్నా మీరు భరించలేరు. విరోధం వచ్చేస్తుంది. పొలం ఇచ్చిన మాట మర్చిపోతారు, ఈ మాట గుర్తు పెట్టుకొంటారు. మానవస్వభావం ఇలా ఉంటుంది. కాని గురువు యొక్క ప్రేమ అటువంటిది కాదు. మీరు ఎన్ని చేసినా ఆయనను తిట్టినా, పొగిడినా మిమ్మల్ని అనుసరిస్తూ గమ్యానికి తీసుకొని పోవటానికి చూస్తాడు.

మీరు ఎవరినైనా ద్వేషిస్తున్నారు అనుకోండి. అలా ద్వేషించే బదులు వారి గురించి ఆలోచించటం మాని వేయండి. మీరు హాయిగా ఉంటారు, ఆరోగ్యం బాగుంటుంది. భగవాన్ ఇలా చెప్పారు మీకు ధ్యానాలు చేసే శక్తి లేకపోతే, జపాలు చేసే శక్తి లేకపోతే మీ మనస్సును గమనించటం మాని వేయండి అని చెప్పారు. మీరు ఎప్పడైతే మనస్సును గమనించటం మానివేసారో, గుర్తించటం మానివేసారో నీరు పోయని మొక్క ఎలా అయిపోతుందో మీ మనస్సు అలా అయిపోతుంది. జ్ఞానికి దేహం ఉండటం వలన లాభం లేదు, దేహం పోవటం వలన నష్టం లేదు. ఎందుచేతనంటే జ్ఞానికి వాంఛ లేదు. మనకి దేహం అంటే వాంఛ ఉంది కాబట్టి దేహానికి రోగం వస్తే భయం, మరణం అంటే భయం వస్తోంది. జ్ఞాని చేసేపని ఎలా ఉంటుంది అంటే ఏదీ నాది అని అనుకోడు, ఏదీ నాది కాదు అని అనుకోడు. జ్ఞాని యొక్క వైభవం అలా ఉంటుంది. మీరు మీసొంత పనులు ఎలా చేసుకొంటున్నారో జ్ఞాని లోకం కోసం అలా పనిచేస్తాడు. దేహం ఉన్నా లేకపోయినా, ప్రపంచం కనిపించినా కనిపించకపోయినా నిర్వికారంగా ఉంటాడు, ఆత్మస్థితిలో ఉంటాడు.

మనం రకరకాలుగా ఉంటాము. గురువు అన్నికాలములలో, అన్నిఅవస్థలలో సమానంగా ఉంటాడు, ఒకటిగా ఉంటాడు. ఎక్కడ ఉన్నా మనం మేడలో ఉంచినా, పెంట మీద కూర్చోబెట్టినా వాడిలో వికారం ఉండదు. వాడు గురువు. ఆ వైభవం అటువంటిది. గురువు కృత్రిమంగా ఉండడు, సహజంగా ఉంటాడు, నిర్మలంగా ఉంటాడు. అచంచలమైన ధైర్యం ఉంటుంది. మీరు గౌరవించినా, గౌరవించకపోయినా ఏమి చేసినా సమానంగా ఉంటాడు, తన స్వరూపంలో నుండి జారడు. అక్కడ రాజీపడడు. ఎందుచేతనంటే నిజం ఏమిటో ఆయనకు తెలుసు. ఈ గొప్పలు తిప్పలు, కష్టాలు, నష్టాలు, సుఖాలు, దుఃఖాలు అన్నీ అహంభవనకే. అసలు వస్తువుకు వీటితో సంబంధం లేదు. మన సహనానికి, ప్రేమకు హద్దులు ఉంటాయి కాని

గురువు యొక్క సహనానికి, ప్రేమకు హద్దులు లేవు. మనకు పాపబలం ఎక్కువగా ఉంటే దుష్టులతో సహవాసం చేయాలని అనిపిస్తుంది. పుణ్యబలం ఎక్కువగా ఉంటే మహర్షుల తోటి, మహాత్ములతోటి సహవాసం చేయాలనిపిస్తుంది. మీకు మంచి స్నేహాలు దొరకలేదు అనుకోండి ఫరవాలేదు కాని చెడ్డవారిని మంచివారు అనుకొని స్నేహం చేస్తే పతనమవుతారు. చదివే పుస్తకాల విషయంలో, తినే తిండి విషయంలో, చేసే సహవాసాల విషయంలో అజాగ్రత్త పనికి రాదు, అశ్రద్ధ పనికి రాదు. నీలో ఒక నిజం ఉంది. అది నీకు తెలియటం లేదు. అందువలన దేహమే నిజం అనుకొంటున్నావు. దేహం పుట్టినప్పుడు పుట్టాను అనుకొంటున్నావు, దేహం మరణించినప్పడు మరణిస్తున్నాను అనుకొంటున్నావు. నిజం నీకు తెలియకపోయినా ఇబ్బంది లేదు తంటా ఎక్కడ ఉంది అంటే దేహమే నిజం అనుకొంటున్నావు.

నన్ను గురువుగా ఎవరిని ఎంచుకోమంటారు అని అడిగితే ఎవరి బోధ నీకు ఇష్టంగా ఉంటుందో ఎవరి సమక్షంలో శాంతి కిరణాలు వచ్చి నిన్ను ఆవరిస్తున్నాయో, ఎవరిని స్మరించుకొంటే నీకు ఆనందం కలుగుతుందో, ఎవరి సమక్షంలో ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలనే కాంక్ష కలుగుతుందో వాడే నీ గురువు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నా దానిని చెడగొట్టడు. ఎందుచేతనంటే ఆ మార్గం కూడా గమ్యానికి చేరుస్తుందని గురువుకు తెలుసు. ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నావు అనేది ముఖ్యం కాదు. ఎందులో నుండి విడుదల పొందితే నీకు తత్త్వం తెలుస్తుందో దానిలోనుండి విడుదల చేయటానికి చూస్తూ ఉంటాడు. నీ ఇష్టం తనకు కష్టం అయినా నీకోసం నీ ఇష్టాన్ని తన ఇష్టం చేసుకొంటాడు వాడు గురువు నీకు ఏమైనా అలవాట్లు ఉన్నాయి అనుకో ఆ అలవాట్లను పెంచడు, అలవాట్లను తగ్గిస్తాడు. కొత్తబంధాలు తీసుకొని రాడు బంధాలు ఊడగొట్టటానికి చూస్తాడు. అది కూడా నీకు నొప్పి లేకుండా చేస్తాడు. పూర్వం ఏవాసన అయితే నిన్ను బంధించిందో ఆ వాసనను తొలగించటమే కాదు పూర్వం ఈ వాసన నన్ను బాధించింది అనే గుర్తు కూడా లేకుండా చేస్తాడు. గురువు ఎంత మంచి మాట చెప్పినా రజోగుణం ఉన్నవాడు దానికి విపరీతార్థములు తీస్తాడు అని భాగవతంలో చెప్పాడు. విపరీతార్థములు తీసి వాడే పతనమవుతాడు అది రజోగుణంలో ఉన్న దోషం. ఒక భక్తుడు ఏమి చెప్పాడు అంటే ఈశ్వరుడు ప్రత్యక్షం అయితే ఒక వరం కోరుకొంటాను. తన ద్వారా మంచి జరుగుతూ ఉండాలి కాని మంచి జరుగుతున్నట్లు తనకు తెలియకూడదు. ఆ జ్ఞాపకం కూడా నాకు రాకుండా చెయ్యి. మంచి జరుగుతున్నట్లు నాకు తెలుస్తోంది అనుకో ఎంత ఆపుకొందామన్నా గర్వం వచ్చేస్తుంది, పతనమవుతాను అందువలన ఆ జ్ఞాపకం కూడా నాకు రాకుండా చూడు అని ఈశ్వరుడిని ప్రార్థిస్తాను అని చెప్పాడు.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL ☎ 24776